



# ఆమెకు - నాకు మధ్య

యం. ఉమామహేశ్వరరావు

"నా పేరు వేదవతి."

రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ అంటున్న ఆమెనే చూస్తూండిపోయాను.

"నేనెవరి భార్యనో చెప్పేకన్నా, లక్ష్మినారాయణ మాస్టారి అమ్మాయిని అంటే మీకు బాగా తెలుస్తుందేమో!" విసురుగా అంది.

"కూర్చోండి!" కుర్చీ చూపించాను.

"ఫరవాలేదు, నించుంటాను. మీలాంటి పెద్దాఫీసర్లముందు నావంటి వాళ్లు కూర్చోకూడదు!" అంది.

ఆమె తన మాటల్ని తూటాలుగా చేసి నా గుండెల్లో పేలుస్తోంది. అయినా సర్దుకున్నాను. ఆమె నన్ను గుర్తుపట్టి కావాలనే ఇలా మాటల తూటాలు సంధిస్తున్నదని అర్థమైంది.

బజరు నొక్కాను. ప్యూను సింహాచలం లోపలకు వచ్చాడు.

"గ్లాసుతో చల్లటి నీళ్లు తీసుకురా!

సింహాచలం కదిలాడు నీళ్లు తీసుకురావడానికి. కేబినంతా పరిశీలనగా చూస్తోందామె.

"వేదవతీ ...!" ఏదో అడగబోతున్న నన్ను ఆపేసింది.

"బావున్నావా? ... మీ నాన్నగారెలా ఉన్నారు? పెళ్లయిందా? మీ పరిస్థితేమిటి? అన్న ప్రశ్నలు దయచేసి వేయకండి. వాటికి సమాధానాలు చెప్పే ఓపిక నాకు లేదు. ఇప్పుడు బతకలేక బతుకుతున్నాను. చావాలని ఉన్నా, చావు రాక బతుకుతున్నాను. నన్నే నమ్ముకుని ఉన్న నా బిడ్డలకోసం మనసు రాయి చేసుకుని మరీ బతుకుతున్నాను!"

ఆమె కళ్లు కన్నీటితో నిండిపోయాయి. సింహాచలం మంచినీళ్ల గ్లాసుతో వచ్చాడు. ఆమె అందుకుని గడగడా తాగేసింది.

"థాంక్స్! ఈ గుండెల్లో చెలరేగుతున్న మంటల వేడిని చల్లటి నీళ్లిచ్చి చల్లార్చుకునేలా చేశారు!"

కొందరికి మాటల్లో విసురుంటుంది. ఆ విసుర్లో ఏ చెడూ ఉండదు. కొందరి మాటల్లో అమృతం కనిపిస్తుంది. అందులో ప్రాణాలు తోడేసే విషం దాగుంటుంది. కొందరి మాటల్లోని విసుర్లో ఎదుటివాళ్లు తమని బాధపెట్టారనో, తిట్టారనో, అన్యాయం చేశారనో విసురు దాగుంటుంది. అటువంటి విసురే వేదవతి మాటల్లో నాక్కనిపిస్తోంది.

"ఇప్పుడిలా మీ దగ్గరకు ఎందుకొచ్చానో మీకు చెప్పనేలేదు!"

ఎదురుగా కూర్చుంటూ అంది వేదవతి. తల ఊపాను అవునన్నట్లు.

"మీరు అర్జంటుగా నాకేదైనా చిన్న ఉద్యోగం ఇవ్వాలి. చదువులో బి.ఏ. పాసయ్యాను. కానీ జీవితంలోనే ఫెయిల్. చదువుకునేప్పుడు రాసిన పేపర్లకన్నా, జీవితం గురించిన పేపర్లే కఠినంగా

ఉండడంతో ఫెయిల్ అయ్యాను. జీవితం పుస్తకంలో ప్రతి పేజీలోనూ సమాధానం చెప్పలేని ప్రశ్నలే ఎదురయ్యాయి."

ఆమె మాటలకు అడ్డు తగిలాను.

"వేదా?...." మెల్లగా పిలిచాను.

ఉలిక్కిపడింది నా పిలుపుతో. ఆమె మోములో ఒక్కసారిగా అరుణిమ చోటుచేసుకుంది.

"వద్దు! ఆ పేరుతో నన్ను పిలవద్దు. అలా పిలిచే హక్కును, నేను మోసపోకముందు ఒకే ఒక్కరికిచ్చాను. ఇప్పుడా పేరుతో ఎవరు పిలిచినా, ఇన్నాళ్లుగా, నా గుండెల్లో దాచుకున్న అగ్నిపర్వతం బద్దలవుతుంది. వద్దు! ఆ పేరుతో నన్ను పిలవద్దు!" హిస్టీరియా వచ్చినదానిలా మారిపోయింది వేదవతి.

"ప్లీజ్, వేదవతీ! దయచేసి శాంతించు. ఇంకెప్పుడూ అలా పిలవను. నన్ను నమ్ము!" బతిమాలాను.

శాంతించింది వేదవతి.

"ఒక రాగం పాడితే వాన కురిసినట్లు, ఒక రాగం పాడితే చల్లని వెన్నెలలు కురిసినట్లూ, ఒక తీయని కంఠస్వరంతో ఓ పేరును స్మరించేదాన్ని. కానీ నేను స్మరించిన ఆ రాగం నా కంఠాన్నే కత్తిరించేసింది. నేను పాడిన ఆ రాగం నా హృదయాన్ని ముక్కలు చేసింది!"

క్రమంగా ఏదేదో భావనలోకి, గతంలోని చేదు భావాల్లోకి వెళ్లిపోసాగింది.

"సరే ... నీకర్జంటుగా ఓ ఉద్యోగం కావాలి కదా! పోనీ ఓ పని చెయ్!" అంటూ టేబుల్ సొరుగులోంచి ఓ తెల్లకాగితం తీసుకుని ఆమెకు అందించాడు.

"ఉద్యోగం ఇప్పించమంటూ ఓ అప్లికేషన్ రాసియ్యి. దాంతోపాటుగా చదువుకు సంబంధించిన ఏవైనా ఆధారాలుంటే కాపీలు తీసి జత చేసియ్యి!" అన్నాను.

ఆ కాగితాన్ని అందుకుంది వేదవతి.

ఆమెకూ, నాకూ మధ్య ఓ రెండు నిముషాల కాలం దోబూచులాడింది.

ఎవరి స్వంత విషయాలు స్వయంగా వాళ్లకే తెలుస్తాయి. ఒకరి స్వంత విషయాలు సంపూర్ణంగా, సమగ్రంగా తెలుసుకోబోవడం అవివేకం. నా విషయంలో కూడా అంతే ...

"సరే, అప్లికేషను రాసి, ఆధారాలు జతచేసి ఎల్లుండి వచ్చి ఇస్తాను!" లేచింది వేదవతి.

ఒక తుఫాను వెళ్లిపోయేముందు, మనకా సంకేతాలు తెలిసినప్పుడు, మన మనస్సులు పొందే ఆనందంలాంటిది కలిగింది నాకు. నేనూ లేచాను ఆమెతోపాటుగా. వెళ్లిపోతున్న వేదవతిని పిలిచాను.

"వేదవతీ!"

ఠక్కున ఆగిపోయింది వేదవతి. వెనక్కి తిరిగి చూడనేలేదు.


"ఇన్నాళ్లకు హఠాత్తుగా కనిపించి, మళ్లీ అలాగే మాయమవుతున్నావు. దయచేసి నీ గురించిన నిజం ఇప్పటికైనా చెప్పు. నా మనస్సు శాంతిస్తుంది."

నా ప్రశ్నకు ఆమె ఎలా స్పందించిందో తెలియలేదు. కానీ ఆమె నుంచి జవాబు మాత్రం వచ్చింది.

"నువ్వు నన్ను కాదని తిరస్కరించాక, నాకు వేరొకరితో పెళ్లి జరిపించారు నాన్నగారు. ఓ ఆరు సంవత్సరాలు ఆయనతో కాపురం చేసిన నాకు నరకం అంటే ఏమిటో బాగా తెలిసింది. శాడిస్ట్ భర్తను చేసుకుని శవమైపోకముందే బతికిపోయాను. ఆయన ఇప్పుడు లేడు. చచ్చిపోయాడు. ఇప్పుడు నాకీ ప్రపంచంలో మిగిలింది నా పిల్లలే!"

రివ్వున బయటకు వెళ్లిపోయింది వేదవతి.

సమాజంలోని కొందరికి విచిత్రమైన మనస్తత్వం ఉంటుందంటారు. అటువంటి మనస్తత్వం గల వ్యక్తే వేదవతి అనిపించింది.




ఆమె మాటల్లో వ్యంగ్యాన్ని, కోపాన్ని జోడించి సంభాషించిన తీరులో కనిపించిన అంశం... కొందరి కోపానికి ద్వేషం ఉంటుంది. మరికొందరి కోపానికి ఆవేశం తప్ప ద్వేషం ఉండదు. ఈ రెండో కోవకే చెందుతుంది వేదవతి. ఆమె నాపై పగతోనే నా వద్దకు వచ్చింది. చిన్న ఉద్యోగం కావాలనడిగింది అనుకున్నాను. కానీ, చివర్లో ఆమె చెప్పిన మాటల్లో నిజం...?

000 000 000

పిండారబోసినట్లు వెన్నెల కాస్తోంది. ఒకప్పుడు వెన్నెట్లో డాబామీద కూర్చుని మాస్టారు చెప్పిన సంస్కృత శ్లోకాలను వేదవతీ, నేను కంఠస్థం చేసేవాళ్లం.

"చంద్రుడి చిరునవ్వే వెన్నెలని మా అమ్మ చెప్పింది. మరి సూర్యుడి చిరునవ్వేమిటి?" నన్ను ప్రశ్నించిందో రోజు వేదవతి.

"సూర్యుడికి చిరునవ్వేమిటి నీ ముఖం!" అన్నాను ఆమెకేం సమాధానం చెప్పాలో తెలియక.

"నా ముఖం కాదు మొద్దూ ... సూర్యుడి చిర్నవ్వు నీ ముఖం. అందుకే ఎప్పుడు చూసినా కస్సు బుస్సుమంటావు!" అంది.

నవ్వేశాను. నాతోపాటు వేదవతీ నవ్వేసింది.

నన్ను తట్టింది అనసూయ. ఉలిక్కిపడి ఆమెవంక చూశాను.

"కొన్ని జీవితాలను తొలి ప్రేమలు వెంటాడుతాయంటారు. అది మీపట్ల నిజం చేస్తోంది వేదవతి. ఆమెలో బాధ, బాధ్యత, దారిద్ర్యం మూడూ కలిసిపోయి ఉన్నాయిప్పుడు. అన్నింటికన్నా మించి మీపట్ల ఆమె మనస్సులో కోపం ఇంకా తగ్గినట్లు లేదు!" అంది అనసూయ అంతవరకూ చెప్పింది వి న్నాక.

"రేపో మాపో అప్లికేషను పట్టుకుని ఆమె వస్తుంది. ఏం చేయాలో అర్థం కాలేదు నాకు!" అన్నాను.

"ఆమెకు మీరు నిజంగా ఏదైనా ఉద్యోగం ఇవ్వదలుచుకున్నారా?" అడిగింది అనసూయ.

"అవును. ఉద్యోగం తప్పకుండా ఇస్తానని ప్రమాణం చేయలేదు. కానీ, ఉద్యోగం ఇవ్వాలనే ఉంది. ఓ విధంగా నేను ఆమెపట్ల చూపిన వైముఖ్యానికి అదే సరైన చర్యని అనుకుంటున్నాను!" అన్నాను.

కాసేపు ఆలోచనలో పడింది అనసూయ.

"పోనీ, ఓ పని చేయండి ... ఓ చిన్న ఉద్యోగం ఏదైనా ఇవ్వండి. కానీ, పోస్టింగు మాత్రం మీ ఆఫీసులో వద్దు. దూరంగా ఏదైనా వేరే బ్రాంచ్‌లో వేయండి. అలాగైతే ఆమెవల్ల మీకిబ్బంది ఉండదు"

లోలోపల ఉరకలు వేస్తున్న అనుమాన

వీచికల్ని బయటకు తెలియనీయకుండా జాగ్రత్తపడింది అనసూయ.

అందుకే. పెద్దలంటారు 'కరణేషు మంత్రీ' అని.

ఆ రాత్రి చక్కగా నిద్రపట్టింది నాకు.

000 000 000

కంగారుగా లోపలకు దూసుకువచ్చాడతను. బయట సింహాచలం వారిస్తున్నా, అతన్ని తోసుకుని లోపలకు వచ్చినట్టు తెలుస్తోంది.

సీరియస్‌గా ఫైలు చూసుకుంటున్న నేను అతని రాకతో తలెత్తి అతనివంక చూశాను. మనిషి ఆయసంతో రొప్పుతూ కనిపించాడు. చెమటలు పట్టి ఉందతని శరీరం.

రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

"వేదవతి చావు బతుకుల్లో ఉందండీ! మిమ్మల్ని వీలైతే తొందరగా తీసుకురమ్మని 'అయ్యా'గారు పంపించారు. నా పేరు సుబ్రహ్మణ్యం. వేదవతి పక్కింట్లో ఉంటున్నాను!" కంగారు కంగారుగా అతనంటున్న మాటలు ఓ నిమిషందాకా అర్థం కాలేదు నాకు. అర్థం చేసుకునేసరికి నాలో కంగారు పుట్టింది. సీట్లోంచి లేచాను.

"అసలేమైందీ వేదవతికి? ఇక్కడికి పంపించిన అయ్యగారెవరు?" అతనితోపాటు నడుస్తూనే అడిగాను.

"ఏటయ్యిందో తెలీదు గానీ, ఆవిడ ఆత్మహత్య చేసుకోబోయిందటండీ! ఇంతలో పిల్లలు గోలపెట్టడంతో ఇరుగు పొరుగు చేరారు. ఆ సమయానికి వేదవతి నాన్నగారూ అక్కడే ఉన్నారు. ఆయనగారే పంపారు నన్ను!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆటో దిగి, నేనూ సుబ్రహ్మణ్యం ఆ ఇల్లు సమీపించేసరికి ఇల్లంతా గందరగోళంగా ఉంది.

జుత్తంతా ముగ్గుబుట్టగా మారిపోయి, ముడుతలు పడిన ఒళ్ళు, వృద్ధాప్యం వల్ల కంపిస్తున్న చేతులతో కనిపించారు లక్ష్మీనారాయణ మాస్టారు. నన్ను చూశారాయన. ఆయన కళ్ళల్లో నీళ్ళు. గబగబా వచ్చి నన్ను కౌగలించుకోబోయారు. వంగి ఆయన పాదాలకు నమస్కరించాను.

ఆయన నోట్లోంచి మాటలు రాలేదు. అటు చూశాను. లోపల మంచంమీద నిస్త్రాణగా పడి ఉంది వేదవతి. ఆ మంచందగ్గర ఆమె పిల్లలు. మంచం సమీపించాను.

నావంక చూసింది వేదవతి. మాస్టారు దగ్గరకొచ్చారు. "ఇతరులను అర్థం చేసుకోవడంకన్నా, అపార్థం చేసుకోవడం కొందరి అలవాటు. అమ్మాయి విషయంలో అదే జరిగింది!"

ఆయన మాటలకు వేదవతిలో చిన్నగా స్పందన.

పిల్లలిద్దరూ ఏడుపు ముఖాలతో నా వంక చూస్తున్నారు. ఆ వాతావరణం చూస్తుంటే నా గుండెలు ద్రవించాయి.

"వేదా!" పిలిచాను. మెల్లగా నావైపు తల తిప్పి చూసింది వేదవతి.

"ఎందుకీ పని చేశావు? ఇప్పుడేం జరిగిందని ఆత్మహత్యకు పాల్పడ్డావో అర్థం కాలేదు. గతాన్ని తవ్వుకుంటూ దాన్నో చిక్కుముడిలా భావించుకుంటూ ఇన్నాళ్లూ జీవించావు. జీవితం అందరికీ ఒకేలా ఉండదు. అయినా నీ కన్నబిడ్డలు ఏమైపోతారోనని ఆలోచించావా? వాళ్లెలా బతుకుతారని అనుకున్నావ్? ...

"నా మీద పగ, ప్రతీకారం తీర్చుకోవాలన్నంత తప్పు నేనేం చేయలేదు. నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పినప్పుడు మీ నాన్నగారి రియాక్షన్ నేను భరించలేకపోయాను. మీ కులం, గోత్రం, వంశం, వాటి ప్రత్యేకతలు అంటూ చెప్పి, నీ జీవితంలోకి నన్ను రావద్దని కన్నీళ్లతో నా చేతులు పట్టుకున్నప్పుడు నేనేం చేయాలి? అక్కడనుంచి తప్పుకోవడం మినహా మరో గత్యంతరం లేకపోయింది. అంతేగానీ, నేను నిన్ను మోసం చేయలేదు. దగా చేయలేదు. ఇప్పుడైనా నమ్ముతావా?"

వేదవతి చేతుల్ని పట్టుకున్నాను. ఆ కళ్లవెంట కన్నీరు కురుస్తోంది. తలతిప్పి తండ్రివంక చూసింది. అదంతా నిజమేనన్నట్లుగా ఆయన తల పంకించారు.

"ఆ నాడు జరిగిందంతా నేను చెప్పేసరికి అమ్మాయిలో ఎంతో ఆవేదన రగిలింది బాబూ! .... పశ్చాత్తాపంతో దహించుకుపోయి, తన్ను తానే శిక్షించుకోవడానికి సిద్ధమైంది!"

మాస్టారి గొంతు గద్గదంగా పలికింది.

"నీకేం కాదు, వేదవతీ! నీ పిల్లలకీ ఏం ఫరవాలేదు!" అంటూ మాస్టారివంక చూశాను. కృతజ్ఞతలు నిండిన కళ్లతో చూస్తున్నారు.

"మాస్టారూ! ఇక్కడే, మీ అమ్మాయి వేదవతి దగ్గరే ఉండిపోండి! వేదవతికి నా దగ్గర ఉద్యోగం సిద్ధంగా ఉంది. ఇక నుంచి ఈ పిల్లల బాధ్యత, వేదవతి బాధ్యత మీదే!"

అక్కడనుంచి ఇవతలకి వచ్చేశాను. ■

## మళ్లీ అదే సంచలనం



రెండు దశాబ్దాల క్రితం తెలుగు పాఠకలోకంలో వినూత్న సంచలనం రేపిన యండమూరి 'తులసిదళం' తాజాగా బుల్లితెరపై కూడా అదే సంచలనాన్ని రేపుతూంది. జెమిని టీవీలో ప్రతి మంగళవారం ప్రసారమవుతున్న తులసిదళం అన్ని ఛానెల్స్‌లో ప్రసారమవుతున్న అనేక సీరియల్స్ కన్నా వ్యూయర్‌షిప్‌లో నంబర్ వన్‌గా వున్నట్లు టామ్ మీడియా సర్వీస్ తాజా రీసెర్చిలో (16 జులై నుంచి 22 జులైల మధ్య చేసిన సర్వే) ప్రకటించారు. ఈ సీరియల్ ప్రేక్షకులు అధికసంఖ్యాకులు స్త్రీలూ, పిల్లలూ కావడం విశేషం. తమిళ డబ్బింగ్ వాసనతో ఎపిసోడ్లకు ఎపిసోడ్లు సాగుతున్న అనేకానేక సీరియల్స్ మధ్య మనదైన భాష నుంచి వచ్చిన తులసిదళం ఓ హార్రర్ థ్రిల్లర్‌గా మళ్లీ అలరిస్తోంది. నిర్మాణవ్యయానికీ, నాణ్యతకూ ఏమాత్రం లోటురాకుండా దీన్ని తీస్తున్నారు. తులసిదళం క్లయిమాక్స్‌ను సహజత్వం కోసం మనాలీ, హిమాలయపర్వతశ్రేణుల మధ్య అయిదారు టీమ్‌ల సాంకేతికబృందం సహకారంతో తీయడం మరోవిశేషం. టెలివిజన్ ఛానెల్స్‌లో ప్రసారమవుతున్న టాప్ 60 కార్యక్రమాల వరుసను ప్రేక్షకుల వీక్షణత ఆధారంగా టామ్ మీడియా రీసెర్చివారు ప్రకటిస్తూవుంటారు. యండమూరి వీరేంద్రనాథ్ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ప్రసారమవుతున్న తులసిదళం ప్రకటనల తుఫానుతో నిర్మాతలకు కాసులు కురిపిస్తూంది.

కె.రామదాసు(చెన్నయ్)